పెళ్లితాపులు

"యత్యన్"

"ఉత్తరా లేం రాలేదుటోయ్?" అంటూ అందుకున్నా ఒక శుభలేఖను తపాలా బంట్రోతువద్దనుంచి.

"లేదండీ" అంటూ వెళ్లిపోయా డతడు.

"పెండ్లిపిలుపు" అని చదువుతూ కుర్చీలో కూలబడ్డాను. వెంటనే నాఒళ్లు గరిపాడిచిన ట్లయింది. మన స్సన్యాయత్త మైంది.

* * *

రేపు కాలేజి తెరుస్తారు. అప్పుడే రూముకి వచ్చా రైలు దిగి. సామాను లోపల పెట్టించా కూలీవాడిచేత. ఇంతలోకే మా ప్రియస్నేహితుడు రంగా వచ్చాడు.

కాస్సేపు పిచ్చాపాటీ కొట్టాం. ఇంతలో సూర్యుడు పశ్చిమాద్రిని జేరడాన, రంగడు కొంపకి, నేను అన్నదాత సుబ్బయ్యభవనానికీ బయల్దేరాం.

"కబుర్లలో రంగా చెప్పాడు - శెలవుల్లో ఎవరో నాకోసం రెండుమూడుసార్లు వచ్చారని. పెండ్లి మనువు విషయమై అనికూడా చూచాయగా అన్నాడు. ఇంక అది విన్నప్పటినుంచీ నాకు కాలు నేలమీద ఆనలే దంటే నమ్మండి.

మరునాడు కాలేజీనుంచి అప్పుడే వచ్చా రూముకి. ఇంతలో నావెనకాలే ఒకాయన లోపలకు వచ్చాడు.

"సుబ్బారావు గారంటే మీ రే నా?" అన్నాడు బహుసున్నితంగా.

"ఔనండీ, తమరూ...?" అన్నా వినయంగా అదోమాదిరి.

"మీరు ఫోర్త్‌యియర్ కాదూ చదువుతూంటా? అన్నాడు నన్ను నిర్ధారణచేసుకుంటూ."

"ఔనండీ." అన్నాను.

సంభాషణధోరణిని బట్టి ఈయనే కాబోలు సెలవుల్లో నాకోసం వచ్చింది అనుకున్నాను.

నే ననుకున్నది నిజం.

"మీకోసం యిదివరలో రెండుసార్లు వచ్చాను. మీరు నన్నెగరు కాసీండి. మీవాళ్లు బాగా యెరుగుదురు." అని ఉపోద్ఘాతంతో ప్రారంభించాడు. నేను వాక్యానికీ వాక్యానికీ మధ్య సందు బోకుండా "ఊఁ" కొడ్తున్నాను.

"నాకు ఒక చెల్లె లుండీ..." అంటూ ఏదో చెప్తున్నాడు గాని పారవశ్యంలో నాక వ్వేవీ వినబల్లేదు.

"ఈవిషయమై మీ తలిదండ్రులవద్దకు వెళ్లి వచ్చాను...వారు మాత్రం ఏ మంటారు? పిల్లా పిల్లణ్ణి చూచుకుంటే లగ్ననిశ్చయం చేసికో వచ్చునన్నారు" అన్నాడు.

"ఆఁహా" అన్నాను వింటున్నట్లు విశద పరుస్తూ.

"పిల్లకు పద్నాలుగో యేడు. కాస్త సంగీతం అదీ వచ్చు. ఫోర్త్ ఫారందాకా చదివింది." అని ఎడ్వర్‌టయిజ్ చేస్తో నన్నువిశ్లేషిస్తున్నాడు.

మధ్యలో "మరి మీ ఉద్దేశ్య మేమంటారు?" అని వేశాడో గడ్డు ప్రశ్న.

"చచ్చాన్రా దేవుడా"అనుకున్నా. లేకపోతే అదేం ప్రశ్న! అందులోనూ పెండ్లికొడుకునా?

ఐనా మనస్సు బిగపట్టి, "నా దేముందండీ, పెద్దవాళ్లున్నారుగా?" అన్నా జిహ్వాంతం నుంచి.

"ఆ విషయం చెప్పానుగాదూ? ఐతే లేవండి వెళ్దాం బెడవాడ. పిల్లను చూచి రేపు రావచ్చు" అన్నాడు వ్యవహారం చాలావరకు పరిష్కారం ఐనట్లు.

"ఊఁ" అంటూ నే నో గుటక వేశాను. నాకైతే వెళ్లి చూచివద్దామని, మనస్ఫూర్తిగా వుంది. ఐతే ధైర్యం చాలలేదు. ఎవరైనా, ముఖ్యంగా రంగా, గేలిచేస్తాడేమో నని బిడియ పడ్డాను.

"ఇవ్వాళ వీలు పడదు లెండి. ఈసారి చూద్దాం" అన్నా బెట్టుగా.

"అల్లా కాదు. మీరు మళ్లా వెంటనే తిరుగు ముఖం పట్టవచ్చు"నని అభయ మిస్తూ నాచేత సరే ననిపించాడు.

"బయల్దేరుతూండండి. నే పోయి బండీ తెస్తా"నని సగర్వంగా (ఉత్తరగోగ్రహణంలో విజయం సాధించిన విజయుడిలా) బయటికి సాగాడు. ఇక నేను 'మ్యారేజి ఇంటర్వ్యూకు' ముస్తాబౌతున్నాను.

ఇంతలో వాకిట్లో కారు హారన్ మోత వినపడింది. తొంగి చూద్దునుకదా ఒక జీపు ఆగి వుంది. "గెట్ ఇన్ మిస్టర్ సుబ్బరావు" (*get in Mr. Subbarao*) అని ఒక అపరిచిత కంఠస్వరం వినపడింది.

ఇంత చనువుగా పిలిచేది ఎవరా అని ఒక సెకండు ఆలోచించా. కాని 'అబ్బాపతే'నని వెంటనే నిర్ధారణ చేసికున్నా. సరే, మాట్లాడకుండా తలుపుకు తాళం తగిలించి జీప్ ఎక్కాను.

ఇక నా పూహాపథంలో చిత్రాలు ఎన్నెన్ని గడచిపోయాయో చెప్పలేను. అసలప్పుడు నా కేదైనా ఆలోచన వచ్చిందో లేదోకూడా చెప్పలేను.

కారు శరవేగాన పోతోంది. కాని కారులో మా (కాబోయే) బావగారుమాత్రం కనపడలేదు. బహుశా స్టేషనులో కలుస్తారేమో అని సంతృప్తి చెందాను.

కారు పోయిపోయి పోలీసుస్టేషను ముందాగింది. ఎవరికోరకో అనుకున్నాను. ఇంతలో నా కారులో ఆతడు దిగి నన్ను "గెట్ డౌన్" అన్నాడు కొంచెం కటువుగా. మొదట నన్ను కాదేమో అనుకున్నాను. కాని నేనుకాక ఇం కెవరున్నారు దిగవలసింది? నా కేం అర్థం కాలేదు. విషయమంతా అగమ్యగోచరంగా ఉంది.

"గెట్ డౌన్" అని మళ్లీ కఠోరతమంగా వినపడింది. నా కేం తోచలేదు. ఎల్లా ఎక్కానో అల్లాగే మౌనంగా దిగా. తరువాత నాకు లోపలి కళ్లే దోవ చూపించబడ్డది.

ఒక్క క్షణంలో నా చుట్టూ పదిమందీ పిశాచాల్లాగా మూగారు.

ఇంతలో ఒక డొచ్చాడు! సబ్ఇన్‌స్పెక్టరేమో!

"*Come on, you fellow, out with the truth*" (రావోయ్. రా. కక్కు. నిజం కక్కు) అన్నాడు. నేను మౌనము ద్రవహించా.

"*Come on*" అంటూ హూంహూరిగా రెండు వడ్డించాడు.

"నాకేం తెలీయదండీ" అన్నా వణుకుతూ.

"తెలియదూ?" అంటూ పచ్చడి పచ్చడిగా కొట్టాడు.

ఈ దెబ్బలో ప్రతీవాడూ తలో తన్ను తన్నారు.

"చిక్కావురా! ......సెలనుంచీ చంపుతున్నావు" అని ఒకడు.

"నా......!నువు నా యకుడివిరా" అని ఇంకొకడు.

"ఇన్నాళ్లెక్కడ చచ్చావురా" అని మరొకడు.

తలా ఒకటే, రెండూ జబురుకున్నారు. నా కిదంతా గొడవగా ఉంది. ఏడుపూ రాలేదు మాటా రాలేదు.

ఇంతలో ఒక డొచ్చి నా జేబు తడుముతున్నాడు. దేనికో అనుకున్నా.

"..... ఒక దమ్మిడీ అన్నా లేలేదు కదరా" అని అంటూ కసితీరక, నా (పెండ్లి ముస్తాబు) సిల్కుచొక్కా చినిగేలా కొట్టాడు. పెండ్లి సంబరంలో పర్సు మరిచిపోవడం కూడా మేలే ఐంది. ఇంతలో మరొకాతానదిగాడు—ఎర్రని కండ్లు బుర్రమీసాలూ తనూ.

"ఇన్నాళ్లూ ఎక్కడ దాక్కున్నావు? మీకరపత్రా లెవరు వ్రాస్తున్నారు? నిజంచెప్పు. లేకపోతే.." అని దౌర్జన్యపూరితంగా సంబోధించాడు.

"నా కేమీ తెలీదండీ" అన్నా ముక్తసరిగా.

"సరే" అంటూ నన్ను ఆ పిశాచాలకు వదిలిపోయాడు. ఇక నాపాట్లేమని చెప్పుదును? ఒకడు నామీద స్వారి చేయడమేనా? నా కంఠానికు గంతగట్టి మొట్టికాయలు కొట్టడమేనా —ఏంచెప్తాను?

ఇంతలో మాబావమరది వచ్చి "ఏమండీ బావగారూ, పెండ్లి చేసుకుంటా ?" అన్నాడు పకపకలాడుతూ.

"ఓరి నీమొహం ఈగ్నా! నువ్వింతకూ C. I. D. వత్రూ?" అనుకున్నా లోపల. కాని కుయ్ కయ్ లాడలేదు. ఎందుకూ? పెదిమ మెదిలిస్తే.. సత్యం బహిర్గతం చేయడానికి వీల్లేక పోయె!

ఇంతలో ఒక పాకీది వచ్చి అధికారుల ఆజ్ఞ శిరసావహిస్తూ తన చీపురుతో దిష్టి తీస్తోంది. అదేమని అనడానికి వీల్లేదు. కారణం - అదీ ఒక ప్రభుత్వోద్యోగిగా! తల వంచుకున్నాను.

ఇల్లా అవమానించి ఏదో సాధిద్దామని కాబోలు. కాని ఆ మనుష్యులను నేనే ఎందుకు ఎరైనానో తెలీలేదాయె!

చివరికి ప్రాణాలమీద ఆశ వదలి, పారిపోతున్న పంచప్రాణాలను పట్టుకుని, ధైర్యంచేసి, తెగించి ప్రబల ప్రయత్నంతో "ఎందుకండీ న న్నిల్లా హింసించడం?" అన్నాను. ఇంకో రెండు తాపులు తిన్నాను.

ఇంతలో ఒక ఫ్రెంచికటింగ్ మీసాల ఆసామి "బ్రదర్, దీనిమీద సంతకం చెయ్యి. బాగుపడతావు. లేకపోతే ఈ శీతలరాత్రుల్లో దిగంబరిస్ట అడవుల్లో అల్లాడాల్సి వుంటుంది" అని విశదం చేశాడు. అసలు సంబోధనతోనే నాకు గాంధీజీ, బుద్ధుడు వగైరాలు గుర్తుకొచ్చారు. అక్కడ అంతమాత్రం మృదువుగా మాట్లాడేవా రున్నందుకు ఆశ్చర్యపడ్డాను. సంతోషించాను కూడా.

ఆతృతతో ఆ కాగితం అందుకొని ఇల్లా చదివాను: "నే నింతతో.. సంఘంతో సంబంధం, సభ్యత్వం వొదులుకుంటున్నాను" అని ఇంకా ఏమేమో వుంది. నాకు తేళ్లూ, జెర్రులూ పాకిన ట్లయింది.

"నా కసలు దాంతో సంబంధం లేదండీ. నే నో చదువుకునే కుర్రాణ్ణి" అని బావురు మన్నాను. ఇందాకటి బాధంతా ఇప్పు డనుభవానికి వచ్చింది.

"ఆ!" అన్నా డాయన ఆశ్చర్యార్థకంగా ప్రశ్నిస్తూ.

"ఐతే మీ పేరు?"

"పి. సుబ్బారావు."

"మీ రేం చదువుతున్నారు?"

"ఫోర్తు బి. యస్‌సి."

"ఓ! క్షమించండి: మీకు ఫోర్తు బియ్యే చదివే వి. సుబ్బారావుగా రని మా సి. ఐ. డి రిపోర్టు చేశాడు. మీరు మమ్మల్ని క్షమించాలి"అని ప్రాగేయపడ్డాడు. ఇంతలో తక్కిన రూపా ఒక్కొక్కటే తప్పుకున్నై. మా బావమరదిమాత్రం చివాట్లు తినేవరకూ అక్కడే ఉన్నాడు.

నేను చావు తప్పి కన్ను లొట్టపోయి బయటపడ్డా. కేసు పెడదామా అనుకుంటే దమ్ముల్లేవు అందుకని నాలో నేను దిగమింగా. అప్పటినుంచీ పెండ్లంటే......

* * *

మరొకసారి శుభలేఖ చూస్తూ'ఇస్సు'రన్నాను.

ఇందాకటినించీ నా చర్యను గమనిస్తోంది మా చెల్లాయి.

"ఏమిటన్నాయి. ఎన్ని సార్లు పిల్చినా కాఫీకి రావు?" అనేవరకు నాకు మెలుకువ వచ్చిన ట్లయింది. చూద్దునుకదా చేతిలో శుభలేఖా, ఎదురుగా చెల్లాయి. నాకు నవ్వు వచ్చింది సరేనంటూ కాఫీకి లేచాను.



HVM. 100-172 TL